# రోడ్లు అధ్వానం..!



జిల్లాలో పలుచోట్ల రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. డ్రైయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై చేరుతోంది. వేమనపల్లి మండలం నీల్వాయి వాగు వంతెన అప్రోచ్‌రోడ్డు కోసం కాంట్రాక్టర్ నాణ్యత లేని మొరం వాడుతుండటంతో వర్షాలు కురిసినప్పుడల్లా బురదమయంగా మారి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు సమస్యలు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.



## ధ్వంసం..

**కాసిపేట:** మండలంలోని ముత్యంపల్లి గ్రామపంచాయతీలోని గుండ్లపహాడ్ గ్రామ ప్రధానరోడ్డు ధ్వంసమైంది. ఇటీవల అదనపు రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం ఎర్రమట్టి గుట్ట నుంచి మట్టి తరలింపునకు అధికారులు కాంట్రాక్టర్‌కు అనుమతులిచ్చారు. భారీ వాహనాలు(లారీల), జేసీబీ సాయంతో మట్టి తరలింపు చేపట్టగా రోడ్డు ధ్వంసమవుతోందని స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారకులు అనుమతులిచ్చిన అధికారుల.., లేక నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టరా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని రోడ్డు బాగుచేయించాలని కోరుతున్నారు.



## బస్సు సౌకర్యం బంద్

**కోటపల్లి:** మండలంలోని లింగన్నపేట ఎదులబంధం, పార్‌పల్లి గ్రామాల మధ్య రోడ్డు సౌకర్యం బాగా లేక పార్‌పల్లి, లింగన్నపేట, ఎదులబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ, సుపాక, వెంచపల్లి గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు లింగన్నపేట, ఎదులబంధం గ్రామాల మధ్య రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో బస్సులు నిలిచిపోయాయి. దీంతో 12గ్రామాల ప్రజలకు ప్రైవేట్ వాహనాలే దిక్కయ్యాయి. పార్‌పల్లి లింగన్నపేట గ్రామాల మధ్య వంతెన నిర్మాణం వద్ద రోడ్డు నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. బస్సు సౌకర్యం నిలిపివేశారు. అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యాం కల్పించాలి.

## బురదతో ప్రయాణికుల అవస్థలు

**వేమనపల్లి:** నీల్వాయి వాగు వంతెన అప్రోచ్ రోడ్డు నుంచి కొత్తగూడం వరకు ఆర్‌అండ్‌బీ నిధులతో నాలుగు నెలల నుంచి పనులు చేపడుతుండగా మందకొడిగా సాగుతున్నాయి. రోడ్డు కోసం కాంట్రాక్టర్ నాణ్యమైన మొరం వాడాల్సి ఉండగా పక్క నే ఉన్న మొండిగుట్ట నుంచి సుద్దమట్టిని వాడుతున్నారు. ఇటీవల వర్షం పడుతుండటంతో బురదమయంగా మారి ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి.



బురద రోడ్డులో వెళ్లలేక ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



## గుంతలు.. తిప్పలు

**భీమారం:** మండల కేంద్రం నుంచి తాళ్లగూడెం వెళ్లే రోడ్డుపై దాదాపు రెండు కిలోమీటర్ల పొడువు గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉంది. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని రెండేళ్ల నుంచి అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని పలువురు వాహనదారులు, స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి బీటీరోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.



ఏడో వార్డులో డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

## డ్రెయినేజీ కరువు.. మురుగుకు నెలవు

**లక్సెట్టిపేట:** మున్సిపాలిటీ పరిధి ఏడో వార్డు ఆంధ్రాకాలనీలో, ఆర్టీసీ బస్టాండ్ వద్ద డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలు నిర్మించి మురుగునీరు రోడ్డుపై పారకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆర్టీసీ బస్టాండ్ వద్ద...

## క్లుప్తంగా

### స్తంభం సరిచేశారు



సాక్షి ఎఫెక్ట్..

**లక్సెట్టిపేట:** స్తంభాలు వంగి ప్రమాదకరంగా ఉన్నాయని అక్టోబర్ 28వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'మృత్యు పాశాలు' అనే కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఇటిక్యాల, తిమ్మాపూర్ గ్రామాల మధ్య వ్యవసాయ పొలాల్లో 11కేవీ విద్యుత్ స్తంభం వంగి ఉండడంతో శనివారం విద్యుత్‌శాఖ అధికారులు సరిచేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

### శివాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ



పూజలు చేస్తున్న భక్తులు

**చెన్నూర్:** చెన్నూర్ శివాలయ ప్రాంగణంలో కార్తీక మాసం సందర్భంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శనివారం కార్తీక మాసం ప్రారంభం కావడంతో తెల్లవారు జామునే భక్తులు గోదావరి స్నానాలు ఆచరించి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల శివ నామస్మరణతో ఆలయం మారుమోగింది. భక్తులు తొలిరోజు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు వేమారం మహేశ్వర్‌శర్మ, హిమకర్‌శర్మ, పులి దత్తమూర్తి శర్మ పాల్గొన్నారు.

### అట్టహాసంగా ముగిసిన దండారీ ఉత్సవాలు



గిరిజనులతో అధికారులు, నాయకులు

**తాండూర్:** ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పడుతున్న దండారి ఉత్సవాలు శనివారం తాండూర్ మండలంలో అట్టహాసంగా ముగిశాయి. మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధి రాము గూడెంలో దండారీ ఉత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు హాజరై వేడుకల్లో భాగస్వాములయ్యారు. గిరిజనులతో మమేకమై దండారి ఆడారు. కార్యక్రమంలో ఏఈ విష్ణు, మాజీ ఉప సర్పంచ్ పరపతిరావు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయిలో సత్తా చాటాలి



శ్రీవత్సవ్‌ను అభినందిస్తున్న డీఈవో

**మంచిర్యాలఅర్బన్:** రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి శ్రీవత్సవ్ జాతీయ స్థాయిలో సత్తా చాటాలని డీఈవో యాదయ్య సూచించారు. నవంబర్ 1న పాఠశాల విద్యాశాఖ తెలంగాణ ఆధ్వర్యంలో ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించిన రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో విజువల్ ఆర్ట్స్ విభాగంలో అల్ఫోర్స్ కళాశాలకు చెందిన శ్రీవత్సవ్ మొదటి బహుమతి సాధించారు. జనవరి 2025లో మధ్యప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ కళోత్సవ్ పోటీల్లో పాల్గొననున్నారు. డీఈవో కార్యాలయంలో శనివారం శ్రీవత్సవ్‌ను డీఈవో యాదయ్య అభినందించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

### వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై శ్వేత

**భీమారం:** మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిలో భీమారం వద్ద శనివారం ఎస్సై శ్వేత ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు సమీపంలో గల భీమారం గుండా వెళ్లే వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు.

## బీసీ కులగణన సర్వే పకడ్బందీగా చేపట్టాలి

**తాండూర్/కోటపల్లి/భీమారం:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కులగణనను పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. కోటపల్లి మండల పరిధిలో సమగ్ర కుటుంబ సర్వేను ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమగ్ర కుటుంబ సర్వేను సిబ్బంది ఎలాంటి తప్పులు లేకుండా పక్కాగా చేపట్టాలని, ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలు సేకరించి నమోదు చేయాలని, ఒక్క ఇంటిని కూడా వదిలివేయకుండా సర్వే చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, సిబ్బందిదేన్నారు. తాండూర్‌లో మండల ప్రత్యేక అధికారి అంజయ్య, మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమాల్లో భీమారంలో పంచాయతీ అధికారి కృష్ణమూర్తి, కోటపల్లిలో తహసీల్దార్ మహేంద్రనాథ్, డిటి నవీన్‌కుమార్, కార్యదర్శి సత్యనారాయణ, తాండూర్‌లో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, కార్యదర్శులు కల్పన, వసంత, కార్తీక్, రాజు, ఎన్యుమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కోటపల్లి: సర్వే తనిఖీ చేస్తున్న ఆర్డీవో శ్రీనివాస్


### అండగా ఉంటాం



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

**మంచిర్యాలటౌన్:** ఆపదలో ఉన్న వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల పట్టణంలోని తన నివాసం వద్ద శనివారం 170మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ వైస్ చైర్మన్ మహేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా సమాధుల పండగ



**రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్:** రామకృష్ణాపూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని సమాధుల వద్ద, మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ వెనుకల గల క్రైస్తవుల శ్మశాన వాటికలో క్రైస్తవులు ప్రతీ ఏటా జరుపుకునే సమాధుల పండగ (ఆల్ సోల్స్ డే)ను శనివారం ఘనంగా నిర్వహించారు. సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ప్రతీ సమాధి వద్ద రామకృష్ణాపూర్‌లో సీఎస్‌ఐ సెయింట్ పీటర్స్ చర్చి పాస్టర్ జాషువా, మందమర్రిలో సీఎస్‌ఐ చర్చి రెవరెండ్ జర్మియా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

### ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు వీడ్కోలు



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న అధికారులు

**శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో ప్రాజెక్టు ఇంజనీర్‌గా పనిచేసి బదిలీపై రామగుండం 3 ఏరియాకు వెళ్తున్న చంద్రశేఖర్‌ను శనివారం జీఎం కార్యాలయంలో ఏరియా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్, ఏరియా అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఓపెన్‌కాస్ట్‌లో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి ఎస్‌ఓటు జీఎం గోపాల్ సింగ్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఇందారం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి ఏవి రెడ్డి, ఏజెంట్ రాముడు డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, చంద్రలింగం, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### బొగ్గుబాయి వార్తలు

#### 'ప్లేడేలపై ఆంక్షలు తొలగించాలి'

**శ్రీరాంపూర్:** సింగరేణిలో పనిచేస్తున్న పారా మెడికల్ సిబ్బందికి ప్లేడేలు, పీహెచ్డీ లపై పెట్టిన ఆంక్షలు తొలగించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య యాజమాన్యాన్ని కోరారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శనివారం ఆయన సంస్థ సీఎండీ బలరాం నాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్లేడే, పీహెచ్డీలపై ఆంక్షలు విధిస్తూ ఇటీవల విడుదల చేసిన ఎస్–1 ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు.

#### లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

**శ్రీరాంపూర్:** సింగరేణిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులు ఈ నెలలో లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని డీజీఎం(పర్సనల్) అరవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పొందాలన్నా, మెడికల్ కార్డు రెన్యువల్ చేసుకోవాలన్నా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి కూడా లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాల్సి ఉందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు మీసేవ కేంద్రాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉందన్నారు.

### ఎల్‌వోసీ అందజేత



బాధితుడికి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

**నెన్నెల:** మండలంలోని మైలారం గ్రామానికి చెందిన వేల్పుల శ్రావణ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని బాధితుడి కుటుంబ సభ్యులు గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీష్‌గౌడ్‌కు విన్నవించారు. ఆయన ఈ విషయాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అత్యవసర చికిత్స కోసం సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల ఎల్‌వోసీ చెక్కును మంజూరు చేయించారు. సమస్య చెప్పగానే స్పందించిన ఎమ్మెల్యే వినోద్‌కు, గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీష్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యార్థులకు శాపంగా ఫీజు బకాయిలు

**మంచిర్యాలఅర్బన్:** విద్యార్థులకు ఫీజు బకాయిలు శాపంగా మారాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. పెండిగ్ ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, కళాశాలలో మధ్యాహ్న భోజనం పెట్టాలని, హాస్టల్‌కు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయకపోవటతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా బాధ్యులు అంజి, అన్వేష్, చరణ్, నికిత, సాయి తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**బెల్లంపల్లి/దండేపల్లి:** ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్‌లో శిక్షణ కోసం నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని న్యాక్ ఉమ్మడి ఆదిలాబాద్ ఏడీ నాగేంద్రం, శిక్షకులు వెంకటేశ్వర్లు, రవి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, డీడీయూజీకేవై ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు బెల్లంపల్లి కేంద్రంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ మూడు నెలల కాలం వరకు జరుగుతుందన్నారు. శిక్షణకు హాజరయ్యే యువకులకు ఉచితంగా భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ రంగంలో ఉద్యోగం కల్పిస్తామన్నారు. 18నుంచి 35ఏళ్ల లోపు వయస్సు కలిగిన యువకులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం, విద్యార్హత సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 8328507232 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## సంక్షిప్త వార్తలు

**'పాఠశాలలకు అంతరాయం కలుగకుండా సర్వే చేపట్టాలి'**

**మంచిర్యాలఅర్బన్:** కులగణ సర్వేను పాఠశాలలకు అంతరాయం కలగకుండా నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రపాణి, రాజావేణు డిమాండ్ చేశారు. బోధనాభ్యసన ప్రక్రియకు ఆటంకం కలుగకుండా చూడాలని కోరినప్పటికీ పట్టించుకోకుండా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే డ్యూటీ వేసి ఒకపూట బడి నడిపి మాధ్యాహ్నం చేయాలనడం సరికాదని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలు మూడు వారాలపాటు ఒక్కపూట నిర్వహించాలని ఆదేశించడాన్ని తప్పుబట్టారు.

**క్రీడలతో మానసికోల్లాసం**

**చెన్నూర్:** క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఎంఈవో రాధాకృష్ణమూర్తి ప్రారంభించారు. జిల్లా స్థాయి పోటీలకు 18మండలాలకు చెందిన 300మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్తయ్య, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు కేవీఎం ప్రకాశ్‌రావు, గోపి, రిటైర్డ్ పీఈటీ రామయ్య, ఉపాధ్యాయులు సుధీర్, రాజేందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

**వాలీబాల్ పోటీలు ప్రారంభం**

**కోటపల్లి:** మండలంలోని ఎసన్‌వాయి గ్రామంలో దీపావళి పండగ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి గ్రామపంచాయతీ వాలీబాల్ పోటీలను శనివారం సీఐ సుధాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై రాజేందర్, కార్యదర్శి తాజోద్దీన్, మండల అధ్యక్షుడు మహేశ్‌తివారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి**

**కాసిపేట:** ప్రతి ఒక్కరూ బ్యాంకుల్లో ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని ముత్యంపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ కై స్రర్ల అన్సరి తెలిపారు. చిన్నధర్మారంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాకారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కోమటిచేనుకు చెందిన బెడ్డల మౌనిక విద్యుత్‌షాక్‌తో మృతిచెందగా, భర్త రాజేష్‌కు రూ.రెండు లక్షల ఇన్సూరెన్స్ చెక్కు అందచేశారు.